# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

- ❖ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూల ప్రాంతమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను ఈరోజు కలిశారు.

- ❖ "తల్లికి వందనం" పథకం కింద ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.

====================

ప్రపంచంలో పూర్తి స్థాయిలో రైల్వే లైన్ల విద్యుదీకరణ చేసిన దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని కేంద్ర ఆహార శుద్ధి, నూతన పునరుత్పాదక ఇందన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా విజయవాడలో పర్యటిస్తున్న ఆయన ఈ సాయంత్రం రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి రైల్వే స్టేషన్‌లో సదుపాయాలను పరిశీలించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం సహాయం చేస్తుందన్న ఆయన ఇప్పటికే 15 వేల కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు. రాజధాని అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ చేస్తామని చెప్పారు. అంతకుముందు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ప్రహ్లాద్‌జోషి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..

(వాయిస్ 30 సెకన్లు)

====================

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూల ప్రాంతమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భూమి, నీరు, మౌలిక వసతులు పరంగా పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. విశాఖపట్టణంలో ఈ ఏడాది జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సీఐఐ నిర్వహించిన “బిజినెస్ రోడ్ షో”లో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొని ప్రసంగించారు. ‘సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలున్నాయని చెప్పారు. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పని చేస్తున్నామని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చిందన్నారు. సింగపూర్ పారిశ్రామిక వేత్తలు అమరావతిలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

====================

ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను ఈరోజు కలిశారు. ఈ మధ్యాహ్నం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి జులై 1వ తేదీన వీబీజీ-రామ్-జీ ఉపాధి హామీ పథకం జాతీయ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురంలో నిర్వహించాలని కోరారు. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి వీబీజీ-రామ్-జీ ప్రారంభోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ లో నిర్వహించడంతో పాటూ.. తాను కూడా ఆ కార్యక్రమానికి హాజరావుతానని చెప్పారు. అనంతరం పవన్ కళ్యాణ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో రాష్టంలో చేపడుతున్న పనుల గురించి ఆయనకు వివరించామని తెలిపారు. అదే విధంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలపై చర్చించామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. అనంతరం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తో సమావేశమై ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అభివృద్ధికి సంబంధించి గ్రేట్ గ్రీన్ వాల్ మానిటరింగ్ సెంటర్‌కు సహకారం అందించాలని, అదే విధంగా రాష్ట్రంలో పులుల సంరక్షణ కోసం బేస్ క్యాంపుల సంఖ్య 90 నుంచి 150కి పెంచాలని పవన్ కళ్యాణ్ కోరారు.

====================

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సహాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆయన నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య శాఖాధికారులతో మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడి పిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పీటీఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు మంత్రికి  వివరించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ వారంలో ఈ పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ నెల 29వ తేదీన షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

విరామం

====================

రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో MSME పార్క్ లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గడిచిన రెండేళ్లలో కొత్త ఆలోచనలతో చాలా అభివృద్ధి పనులు చేసామని చెప్పారు. MSMEలకు సంబంధించి ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ దేశంలోని ఏ రాష్ట్రంలో లేదని.. ఒక కొత్త ఒరవడితో ప్రత్యేకమైన మార్గదర్శకాలను అనుసరించి ఈ శాఖను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. MSME పార్క్ లతో పాటు ప్రైవేట్ ఇండస్ట్రీ పార్క్ లను తీసుకువస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

విశాఖపట్టణంలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్లపై కొందరు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ఆయన ఈరోజు మాట్లాడారు. డేటా సెంటర్ల ఏర్పాటు వల్ల విశాఖలో నీటి కొరత ఏర్పడుతుందని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్న పోలవరం జలాలు, ప్రతిపాదిత డీశాలినేషన్ ప్లాంట్లను పరిగణనలోకి తీసుకుంటే విశాఖ నగర భవిష్యత్ అవసరాలకు మించి నీటి లభ్యత ఉండనుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతంలో సుమారు 410 ఎంఎల్డీ నీటి సరఫరా జరుగుతోందని ఎంపీ భరత్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================

రాష్ట్రంలో రైతాంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆక్వా రైతులు, ప్రాన్ ఫెడరేషన్ ప్రతినిధులతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

=====================
=====================